కొనసాగుతున్న మహా కుంభాభిషేక మహోత్సవాలు



గోమాత పూజల్లో ఆలయ ఈఓ నాగరాజు, చైర్మన్ సాయిబాబా

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో శత చండీయాగసహిత మహాకుంభాభిషేక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడవ రోజైన సోమవారం ఉదయం ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వర, పుణ్యాహవాచనం, చండీహోమం, శతచండీ పారాయణములు, తీర్థ ప్రసాద వినియోగము జరిపించినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి కుంట నాగరాజు తెలిపారు.

టైపిస్టు, స్టెనో గ్రాఫర్ ఉద్యోగాల భర్తీకి చర్యలు



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న బల్మూరి వెంకట్

లాలాపేట: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న టైపిస్టు, స్టెనోగ్రాఫర్ ఉద్యోగాల పునరుద్ధరణకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. తెలంగాణ టైపు రైటింగ్, షార్ట్ హ్యాండ్, కంప్యూటర్ ఇనిస్టిట్యూట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన కేలండర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించారు. నిరుద్యోగుల కళను నిజం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకు సాగుతుందని బల్మూరి వెంకట్ పేర్కొన్నారు. మసూద్ అలీ, ప్రశాంత్, గిరీష్, అనీల్, మధు, సురేష్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలను పాఠ్యాంశంగా బోధించాలి



అవగాహన కార్యక్రమంలో టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

సనత్‌నగర్: పిల్లలకు చిన్నతనం నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. బంజారాహిల్స్ బచ్‌పన్ స్కూల్ చిన్నారులకు సోమవారం బేగంపేటలోని ట్రాఫిక్ ట్రైనింగ్ పార్కు వద్ద రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు మాట్లాడతూ.. రోడ్డు భద్రతా నియమాలను చిన్నారులకు తెలిసేలా ఒక పాఠ్యాంశంగా బోధించాలన్నారు. రహదారులపై క్రమశిక్షణగా వ్యవహరించాలన్నారు. పిల్లలు రోడ్డు దాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

చిలకలగూడ : మద్యం తాగి వాహనాలు నడిపితే భారీ జరిమానాతో పాటు శిక్ష తప్పదని చిలకలగూడ ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీధర్ హెచ్చరించారు. భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని సోమవారం మెట్టుగూడ చౌరస్తాలో అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రహదారి ప్రమాదాలను నియంత్రించవచ్చన్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డవారిపై కేసు నమోదు చేసి కౌన్సెలింగ్ నిర్వహించారు. సిబ్బంది పాల్గొన్నారు.

టెర్రర్.. క్లాక్‌టవర్

- నిత్యం గొడవలు, హత్యాయత్నాలు
- భయాందోళనలో ప్రజలు



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ క్లాక్ టవర్ మందుబాబులు, ఆకతాయిలు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. నిత్యం గొడవలు, దాడులు, ప్రతిదాడులతో ఈ ప్రాంతం రణరంగంగా మారుతుంది. అడపాదడపా పోలీసులు దృష్టి సారిస్తున్నా మళ్లీ పరిస్థితిలో ఏ మాత్రం మార్పు రావడం లేదు. కేవలం ఇప్పటికిప్పుడు ఈ పరిస్థితి రాకున్నా గత కొద్ది సంవత్సరాల నుంచి ఇక్కడ అవన్నీ శరామామూలుగా మారాయి. వివిధ జిల్లా, రాష్ట్రాల నుంచి వచ్చిన వాళ్లు పదుల సంఖ్యలో క్లాక్ టవర్ ప్రాంతంలోని ఫుట్‌పాత్‌ను అడ్డాగా మార్చుకున్నారు. గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని సెంటినరీ బాప్టిస్ట్ చర్చి, మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెస్ట్రీ చర్చి చుట్టూ ఫుట్‌పాత్, క్లాక్ టవర్ పార్కు ఫుట్‌పాత్‌నే అవాసంగా మార్చుకుంటున్నారు.

నిత్యం మత్తులో..

ఉదయం వివిధ పనులపై వెళ్లిన వారు రాత్రి ఇక్కడికే వచ్చి తిష్ట వేస్తుంటారు. మరికొంత మంది ఎలాంటి పని లేకుండా జులాయిగా తిరగడం, గంజాయి, వైట్‌నర్ మత్తు పదార్థాలకు బానిసలై మత్తులో జోగుతుంటారు. నిరంతరం మత్తులో ఉండే వారు ఎవరిపై ఎప్పుడు దాడులు చేస్తారో అని అటుగా రాకపోకలు సాగించే వారు భయాందోళనకు గురవుతున్నారు. మరికొంత మంది డబ్బు డిమాండ్ చేయడం, ఇవ్వకపోతే చేతికి ఏది దొరికితే దానితో దాడులు చేయడం పరిపాటిగా మారింది. రూ.20, రూ.30లకు దాడులు చేసి హత్యలు చేసిన ఘటనలు ఇక్కడ ఉన్నాయి. గతంలో ఇలాంటి ఘటనలు రెండు గోపాలపురం పోలీస్ స్టేషన్‌లో నమోదయ్యాయి. దాడులు, హత్యాయత్నాల లాంటి ఘటనలు కూడా ఎన్నో ఉన్నాయి. కొన్ని మాత్రమే పోలీసు రికార్డులకు ఎక్కుతున్న మరికొన్నింటిలో బాధితులు ఫిర్యాదు చేయకపోవడంతో లెక్కలోకి రావడం లేదు. కొంత మంది ఆకతాయిలు మద్యంమత్తులో మహిళలను సైతం వేధింపులకు గురిచేస్తుంటారు.

వారంలోపు రెండు ఘటనలు

ఈ నెల 24వ తేదీన రూ.20 కోసం రాజు అనే నిందితుడు ముగ్గురిపై రాయితో దాడి చేయగా సకాలంలో బాధితులను ఆస్పత్రికి చేర్పించడంతో ప్రాణాలతో బయటపడ్డారు. సోమవారం తెల్లవారుజామున నిందితుడు ఇలాగే చిల్లర డబ్బు కోసం ఒకరిని హత్య చేయగా మరొకరు గాయాలతో బయటపడ్డారు. వారం రోజుల్లో రెండు ఘటనలు జరగడంతో స్థానికులు ఉలిక్కిపడుతున్నారు. రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఫుట్‌పాత్‌లపై మందుబాబులు తిష్టవేసి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న పోలీసులు పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలో ఫుట్‌పాత్ వాసుల కోసం జీహెచ్‌ఎంసీ షెల్టర్ హోంలు నిర్మించి ఎన్‌జీవోల ద్వారా వీళ్లను అక్కడికి తరలించినా మళ్లీ తిరిగి ఇక్కడికే వస్తుండటం గమనార్హం.



రోడ్డెక్కుతున్న వ్యాపారాలు.. రాకపోకలకు ఇబ్బందులు

- లాలాపేటలో యథేచ్ఛగా అక్రమ పార్కింగ్
- దృష్టి సారించాలంటున్న వాహనదారులు
- విస్మరిస్తున్న అధికారులు



లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేట ప్రధాన రహదారిలో కొందరు దుకాణాదారులు ఫుట్‌పాత్, రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తుండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డు విస్తరణలో స్థలాలు కోల్పోయిన కొందరు ప్రభుత్వం నుంచి గజానికి రూ. 52 వేలు చొప్పున నష్టపరిహారం తీసుకున్నారు. మళ్లీ రోడ్డుకు కేటాయించిన స్థలంతో పాటు ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకుని చిరు వ్యాపారులకు ఇచ్చి వారి నుంచి నెల వారి అద్దెలు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన రోడ్డు విస్తరణ కబ్జాదారులకే మేలు చేసినట్లయిందని పలువురు వాపోతున్నారు.

అద్దెలకు ఫుట్‌పాత్‌లు..

లాలాపేట అంబేడ్కర్ విగ్రహం నుంచి ఓపెన్ నాలా కల్వర్టు వరకు రోడ్డుకు ఇరు వైపులా ఫుట్‌పాత్‌లతో పాటు సర్వీసు రోడ్డును సైతం ఆక్రమించి వివిధ వ్యాపారాలు నిర్వహిస్తూ ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్నారు. అక్కడికొచ్చే వారు తమ వాహనాలను రోడ్డుపై చాలా సేపు నిలుపుతుండటంతో రాకపోకలకు ఇక్కట్లు తలెత్తి ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. దీనికి తోడుగా ప్రతి మంగళవారం ఈ ప్రాంతంలో వారాంతపు సంత ఏర్పాటు చేస్తున్నారు. ఆ రోజు వాహనాల రద్దీ మరి ఎక్కువగా ఉంటుంది. తరచూ ఈ మార్గంలో వెళ్తున్న ఎమర్జెన్సీ అంబులెన్స్‌లు ట్రాఫిక్‌లో చిక్కుకున్న సందర్భాలు ఉన్నాయి. గతంలో ఈ మార్గంలో వెళ్తున్న పలువురు ఉద్యోగ పోటీ పరీక్షలకు సకాలంలో చేరుకోలేకపోయిన సందర్భాలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి ఆ మార్గంపై దృష్టి సారించాలని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు.

ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టాలి



లాలాపేట ప్రధాన రహదారి పొడవునా ఎక్కడ చూ సినా ఫుట్‌పాత్‌లు కనిపించడం లేదు. వాహనాల వేగాన్ని అదుపు చేసే స్పీడ్ బ్రేకర్లు సైతం లేవు. దీంతో పాదచారులు రోడ్లపై నడుస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పా దచారుల సౌకర్యార్థం ఫుట్‌పాత్ నిర్మాణం చేపట్టాలి.

–మహేశ్, సోషల్ వర్కర్

అక్రమ దందాలకు అడ్డుకట్ట వేయాలి



ఫుట్‌పాత్‌లను ఆక్రమించి అక్రమ దందాలను ప్రోత్సహిస్తున్న దుకాణాదారులపై చర్యలు తీసుకోవాలి. ట్రాఫిక్ సమస్యకు కారణం అవుతున్న ఫుట్‌పాత్ ఆక్రమణలతో పాటు అక్రమ పార్కింగ్‌లు లేకుండా చర్యలు తీసుకోవాలి. లాలాపేట ప్రధాన రహదారిలో వాహనాలు సాఫీగా వెళ్లేలా సంబంధిత అధికారులు దృష్టి సారించాలి.

–మల్లికార్జున్, స్థానిక నేత

మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ పనులను వెంటనే చేపట్టాలి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: డివిజన్‌లోని కైలాష్‌నగర్‌లో మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ నిర్మాణ పనులను వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ ప్రతిపాదిత స్థలాన్ని సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రజల సౌకర్యార్థం మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ కోసం రూ.3.30 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు చెప్పారు. పనులు చేపట్టడంలో జరుగుతున్న జాప్యానికి గల కారణాల గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, డీసీ జగన్, డీఈ మోహన్, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్, ఎలక్ట్రికల్ డీఈ అమర్‌నాథ్, బీఆర్‌ఎస్ నాయకులు నాయకులు బాల్‌రెడ్డి, సంతోష్ సరాఫ్, అశోక్‌యాదవ్, శేఖర్, సురేష్‌గౌడ్,ప్రవీణ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రాజేష్, బాల్‌రాజ్, గులాబ్‌సింగ్, హరిసింగ్,లక్ష్మీ, లలిత, సరితాగౌడ్ పాల్గొన్నారు.

త్వరలో ఈఎస్‌ఐ గ్రేవ్‌యార్డ్ పనులు..

అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్‌లోని ఈఎస్‌ఐ గ్రేవ్‌యార్డ్ అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. సోమవారం ఆయన సంబంధిత అధికారులతో కలిసి గ్రేవ్‌యార్డ్‌ను సందర్శించి మాట్లాడారు. గ్రేవ్‌యార్డ్ అభివృద్ధి కోసం రూ.2 కోట్ల నిధులు మంజూరైనా పనులు ఎందుకు మొదలు పెట్టలేదని అధికారులను ప్రశ్నించగా నమూనాలపై స్పష్టత రాకపోవడంతో ప్రారంభించలేదని సమాధానం ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యే జీహెచ్‌ఎంసీ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడి పనులు చేపట్టడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలోనే ఈఎస్‌ఐ గ్రేవ్‌యార్డ్ అభివృద్ధిలో మోడల్ కానుందని సుమారు 14 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గ్రేవ్‌యార్డ్‌లో అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.



ఫంక్షన్‌హాల్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

పార్కు సందర్శన..

సనత్‌నగర్ బీకేగూడ సీ–టైపు కాలనీలోని పార్కును ఎమ్మెల్యే తలసాని సందర్శించారు. పార్కుకు గేటు ఏర్పాటు చేయాలని, నూతనంగా నిర్మించిన హాల్లో ఎలక్ట్రిక్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, చిల్డ్రన్స్ క్రీడా పరికరాలకు మరమ్మత్తులు చేపట్టాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరగా ఆయా పనులను సత్వరమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ శేసుకుమారి, అధికారులు జగన్, మోహన్, హరి శంకర్, అమర్నాథ్, సంతోష్, గులాబ్‌సింగ్, లలితగోపీచౌహన్, హరిసింగ్,లక్ష్మి పాల్గొన్నారు.

‘రోటరీ క్లబ్’ సేవలు స్ఫూర్తిదాయకం

సనత్‌నగర్: మారుమూల ప్రాంతాల్లో సైతం సేవలందిస్తూ నిరుపేదలకు అండగా నిలబడుతున్న రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ సేవలు స్ఫూర్తిదాయకమని మాజీ ఐపీఎస్ అధికారి ఏకే ఖాన్ కొనియాడారు. సోమవారం బేగంపేటలోని మనోహర్ హోటల్‌లో జరిగిన రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ 2023–24 ఒకేషనల్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పేదల అవసరాలను తెలుసుకుని వాటిని సమకూర్చడంలో క్లబ్ ప్రతినిధులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వివిధ రంగాల్లో సేవలందించిన ఐదుగురికి ఎక్సలెన్స్ అవార్డులను అందజేశారు. మమతాత్రివేది (సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు), వసుంధర రెడ్డి (నచికేత తపోవన్ చైర్‌పర్సన్), మాధవిలత (విరించి హాస్పిటల్ చైర్ పర్సన్), దారా గంగాధర్‌గుప్తా (జీజీ హాస్పిటల్ చైర్మన్), డీవీ మనోహర్ (శ్రీశక్తి గ్రూప్ సీఎండీ)లు అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు డాక్టర్ జ్యోతిరెడ్డి, సెక్రటరీ వజ్రాల రాజగోపాల్, ఒకేషనల్ ఎక్సలెన్స్ అవార్డుల చైర్ పర్సన్ సత్య పింజల పాల్గొన్నారు.



అవార్డులు అందుకున్న వారితో ఏకేఖాన్

శ్మశానవాటికలో వసతుల కల్పన అభినందనీయం

రసూల్‌పురా: శ్మశానవాటికలో అత్యాధునిక వసతులు కల్పించడం అభినందనీయమని ఎంసీఈఎంఈ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ జేఎస్ సిదానా పేర్కొన్నారు. తిరుమలగిరి ఆర్టీసీ కాలనీలోని శ్మశానవాటికలో ఏర్పాటు చేసిన అత్యాధునిక మార్చురీని సోమవారం ప్రారంభించారు. స్వర్గవాటిక ట్రస్ట్ అధ్యక్షులు సురేందర్ పాల్‌సింగ్ మాట్లాడుతూ.. నూతనంగా ప్రారంభించిన మార్చురీలో నాలుగు మృతదేహాలను భద్రపరిచే సామర్థ్యం ఉందని అన్నారు. త్వరలో ఎనీ టైమ్ క్లీనిక్ ఏర్పాటు చేస్తున్నామని ఇందులో ఈసీజీ, రక్త, మూత్ర పరీక్షలు, సీబీసీ, హెచ్‌బీ 1 ఛాతీ ఎక్స్‌రే తక్కువ ఖర్చుతో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. దాతలు రామ్‌గోయేల్, జేసీ. జోదానీ, జయంత్ జైన్ తదితరులతో జనరేటర్ బ్యాకప్, సీసీ టీవీ, ఏర్పాటు చేసినట్లు చెప్పారు.



అత్యాధునిక మార్చురీని ప్రారంభిస్తున్న ఎస్ సిదానా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: బేగంపేట, కుందన్‌బాగ్ సబ్‌స్టేషన్ల పరిధిలోని ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎస్‌ఆర్‌నగర్ వేంకటేశ్వరస్వామి టెంపుల్ లేన్, బీ–టైప్, 3ఆర్‌టీ క్వార్టర్స్, ఎస్‌ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్, మెయిన్‌రోడ్డు, గౌతమిధామం స్కూల్ ఏరియా, ఓల్డ్ రిలయన్స్ ఫ్రెష్, జ్ఞాన సరస్వతి స్కూల్. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు దివ్యశక్తి అపార్ట్‌మెంట్ లేన్, రెడ్డీస్ ల్యాబ్, వైట్ హౌస్, మీనా బజార్, బ్రాహ్మణవాడీ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

33కేవీ లైన్ల కింద నిర్మిస్తున్న ఇంటి నిర్మాణానికి పవర్ కట్

సనత్‌నగర్: బేగంపేట ప్రకాష్‌నగర్‌లో 33కేవీ విద్యుత్ లైన్ల కింద నిర్మిస్తున్న భవన నిర్మాణానికి విద్యుత్ శాఖ అధికారులు సరఫరాను తొలగించారు. ఒకే ప్రాంతంలో కరెంటు వైర్లకు అతి దగ్గరగా నిర్మాణాలు ఉండడంతో సరఫరాను నిలిపివేయడం ఇది రెండోసారి. ఈ సందర్భంగా సికింద్రాబాద్ డివిజనల్ ఇంజినీర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ హైటెన్షన్ లైన్ల కింద నిర్మాణాలు జరిపితే సరఫరాను తొలగిస్తామని హెచ్చరించారు. సాధారణంగా విద్యుత్ లైన్ నుంచి 1 నుంచి 1.5 మీటర్ల దూరంతో నిర్మాణాలు చేపట్టాలన్నారు.

రాళ్లతో దాడిచేసిన వ్యక్తి రిమాండ్

రాంగోపాల్‌పేట్: గత వారం ఇద్దరు వ్యక్తులపై దాడికి పాల్పడిన నిందితుడిని మార్కెట్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. టోలీచౌకీకి చెందిన ఫయాజ్‌ఖాన్(32), అబిద్‌ఖాన్ (32) అన్నదమ్ములు. ఫయాజ్‌ఖాన్ భార్య చనిపోవడంతో గత కొన్ని నెలల నుంచి క్లాక్‌టవర్ వద్ద ఫుట్‌పాత్‌పైనే ఉంటున్నాడు. అతన్ని కలిసేందుకు తమ్ముడు అబిద్‌ఖాన్ క్లాక్‌టవర్ వద్దకు వచ్చాడు. ఇద్దరు అన్నదమ్ములు మాట్లాడుకుంటుండగా ఫుట్‌పాత్‌పైనే నివసించే రాజు (36) మరో వ్యక్తిని బీడీ, రూ.20 అడిగాడు. దానికి అతను నిరాకరించడంతో కొడుతున్నాడు. అక్కడే ఉన్న అబిద్‌ఖాన్ ఎందుకు కొడుతున్నావని రాజును మందలించడంతో అతనిపై దాడికి దిగాడు. దీన్ని గమనించిన సోదరుడు ఫయాజ్‌ఖాన్ అడ్డుకునేందుకు రాగా ఇద్దరిపై రాయితో రాజు దాడి చేశాడు. ఈ ఘటనలో అన్నదమ్ములు ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా రాజుకు స్వల్ప గాయాలయ్యాయి. సోమవారం రాజును అదుపులోకి తీసుకున్న పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

డాక్టర్.. విన్నర్



విజేత మహాలక్ష్మీని అభినందిస్తున్న గాంధీ పాలనాధికారులు

గాంధీఆస్పత్రి : తెలంగాణ రాష్ట్ర వెటరన్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ డబుల్స్ పోటీల్లో గాంధీ వైద్యులు మహాలక్ష్మీ–సరిత జోడీ సత్తా చాటారు. తెలంగాణ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ (టీఎస్‌టీటీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 28న హైదర్‌గూడ సెయింట్ పాల్స్ హైస్కూలు ప్రాంగణంలో జరిగిన పోటీల్లో తెలంగాణ జిల్లాలకు చెందిన సుమారు 200 మంది పాల్గొన్నారు. డబుల్స్ విభాగంలో గాంధీ గైనకాలజీ ప్రొఫెసర్ మహాలక్ష్మీ, డెర్మటాలజీ ప్రొఫెసర్ సరిత జోడి ఫైనల్‌లో సోనాల్ అగ్రానీ, లక్ష్మీప్రసన్నలపై విజయం సాధించారు. సోమవారం గాంధీ మెడికల్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, సూపరింటెండెంట్ రాజారావు విజేతలు మహాలక్ష్మీ, సరితలను అభినందించారు. ఈ కార్యక్రమంలో గాంధీ ఫిజికల్ డైరక్టర్ (పీడీ) డాక్టర్ వేణు, తదితరులు పాల్గొన్నారు.

కోదండరామ్‌పై విమర్శలు తగవు



యాదగిరి

అడ్డగుట్ట: ఎమ్మెల్సీగా నియమితులైన ఉద్యమ నాయకుడు ప్రొ. కోదండరామ్‌పై విమర్శలు చేస్తే సహించమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్. యాదగిరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సబిత ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్, శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డితో తెలంగాణను పదేళ్లు పాలించి తెలంగాణ వనరులు కొల్లగొట్టి లక్షల కోట్ల సంపదను అక్రమంగా ఆర్జించిన వారు కోదండరామ్‌ను విమర్శించడం సిగ్గుచేటన్నారు. కొందడరామ్‌కు ఎమ్మెల్సీ పదవి ఎలా ఇస్తారని ప్రశ్నించడం బీఆర్‌ఎస్ ఓర్వలేని తనానికి నిదర్శనమన్నారు. ఇకపై లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

బూత్‌స్థాయి సమావేశానికి తరలిన నాయకులు

లాలాపేట: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బూత్‌స్థాయి సమావేశానికి తార్నాక డివిజన్ నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. సోమవారం సీతాఫల్‌మండిలో జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరయ్యారు. తార్నాక, లాలాపేట, శాంతినగర్, మాణికేశ్వర్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి బైక్ ర్యాలీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో అమర్‌నాథగౌడ్, బ్రహ్మజీ, అధ్యక్షులు కిషోర్ యాదవ్, రవి, సుధాకర్ తదితరులున్నారు.

ఓయూలో మంత్రి సీతక్కకు సన్మానం



ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర మంత్రి సీతక్కను ఓయూ విద్యార్థి నాయకులు ఘనంగా సన్మానించారు. లా కాలేజీ ఎల్‌ఎల్‌ఎం విద్యార్థి అయిన డాక్టర్. అనసూయ (సీతక్క) మంత్రి అయ్యాక తొలిసారి న్యాయ కళాశాలకు విచ్చేసిన ఆమెకు ఓయూ జేఏసీ నాయకులు స్వాగతం పలికి గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఓరుగంటి కృష్ణ, లెనిన్, నరసింహ, చంద్రోశేఖర్, సురేష్, రాజు, అఖిల్, బాలు, సతీష్, సింహాద్రి పాల్గొన్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

అడ్డగుట్ట: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. లాలాగూడ–మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్ల మార్గం మధ్యలోని పట్టాలపై సోమవారం ఉదయం 7.25 సమయంలో సుమారు 50–55 వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

దళిత ఎజెండాను అమలు చేయాలి



కోదండరామ్‌ను సన్మానిస్తున్న డీబీఎఫ్ నాయకులు

లాలాపేట: ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌ను సోమవారం తార్నాకలోని ఆయన నివాసంలో దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దళిత ఎజెండాను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శంకర్, పులి కల్పన, పులి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

శుభాకాంక్షల వెల్లువ..

ఉస్మానియా యూనివర్సిటీ: ఎమ్మెల్సీ కోదండరామ్ నివాసానికి సందర్శకుల తాకిడి మొదలైంది. కొత్తగా ఎమ్మెల్సీ అయిన కోదండరామ్‌ను కలిసి అభినందనలు తెలిపేందుకు తార్నాకలోని తన నివాసం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు బారులు తీరుతున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి కోదండరామ్ అభిమానులు, ఓయూ అధ్యాపకులు, విద్యార్థి నాయకులతో పాటు ఉద్యోగులు కోదండరామ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్నారు.